

# అబధం తెచ్చిన అవస్థ

రచన: శ్రీ ఎర్రోజు సత్యం.

ఆ ఆఫీసులో ఎవరినోటవిన్నా ఇదేమాట. "క్రొత్తగా వచ్చిన ఆఫీసర్ చాలా స్ట్రిక్ట్ రోయ్! అసలుకదలనివ్వడు మెదలనివ్వడు. ఏ మాత్రం ఆలస్యంగా రానివ్వడు. ఈయనగారితో పెద్దగొడవే వచ్చిపడింది" అని ఒకరంటే...

"అలా అనకోయ్! ఎంతకఠినంగా పనిచేయించుకుంటాడో అంత కరుణతో చూస్తాడు. కష్టంలో ఉన్నవారికి ఎంతో అనుకూలంగా ప్రవర్తిస్తాడు. మొన్న ఫలానా యల్.డి.సి. తల్లి ప్రాణం బాగాలేదంటే రోజు అరగంట ముందు వదిలాడు. అంతే కాదు బదులుగా డబ్బు సహాయం కూడా చేశాడు. అంతమంచి ఆఫీసర్‌ను నేను మాత్రం చూడలేదు" అని మరొకరి వాక్కు.

"ఏమైనా పనిదొంగలకు మాత్రం యమునిలా కనిపిస్తాడు." అని మరొకరి సర్టిఫికెట్.

"మంచిగా పనిచేసేవాళ్ళకు, నీతిపరులకు ధర్మరాజు లాంటివాడు." అని మరొకరి ప్రశంసా పత్రం.

ఎవ్వరేమనుకున్న ఆఫీసర్ రామారావ్ మాత్రం చాలా మంచివారు. ప్రతి ప్రభుత్వోద్యోగి ఆత్మసాక్షిగా కష్టపడి పని చేయాలంటారు. స్వయంగా ఆయన కష్టపడి పనిచేస్తూ ఆఫీసులోని మిగతా ఉద్యోగస్తులతో కష్టపడి పనిచేయించడం ఆయనగారికి అలవాటు.

కష్టంలో ఉన్న వారికి, చేతనైన సహాయం చేయడం వారి మంచితనంలో ఒకటి. కష్టం వచ్చినప్పుడుగాక పట్టి సమయాల్లో కూడా కొందరు పనిదొంగలు లేని సాకులు చెప్పి ఆఫీసునుండి తొందరగా వెళ్ళిపోవడానికి, పని తప్పించుకోవడానికి, ప్రయత్నిస్తుంటారు. అలాంటి వారంటే మండిపడతారు ఆఫీసర్ రామారావ్ గారు. అందుకనే రామారావ్ గారంటే మంచివాళ్ళకు, చెడ్డవాళ్ళకు భయభక్తులు ఉన్నాయి.

ఆనాడు తొందరగా ఇంటికి వెళ్ళాలని, ఆరాటపడుతున్నాడు యల్.డి.సి. ఆనందరావు. ఉదయమే భార్య కాంతతో చెప్పి వచ్చాడు "ఈ రోజు సినిమాకి వెళ్ళాలి, నేను ఆఫీసర్ గారికి మస్కాకొట్టి అరగంట ముందే ఇంటికి వస్తానని" అందుకే ఏమి ప్లానువేసి ఆఫీసర్ గారిని ఒప్పించడం? అని ఆలోచిస్తూ బుర్రకు పని పెక్కించుకుంటున్నాడు ఆనందరావు.

మెల్లగా పిల్లిగా ఆఫీసర్ గదిలోకి వెళ్ళి "సార్" అన్నాడు ఎంతో వినయంగ. "ఏమిటి?" అన్నట్లు ఫైల్లోనుంచి తలను పైకెత్తి చూశారు ఆఫీసర్ గారు.

"మరేం లేదుసార్ మా, మా, మా, ...... మిసెస్‌కి" భయంతో చెప్పలేక పోతున్నాడు ఆనందరావ్.

"ఆఁ ఏమిటో తొందరగా చెప్పవోయ్! ఏమిటా మా మ్యా మీ మ్యాలు" అన్నారు ఆఫీసర్ గారు సమయాన్ని వృధా చేయడం గిట్టక.

"మరేంలేదండీ మా మిసెస్‌కి, వారం రోజులనుండి ఒకటే జ్వరం. కదలలేనిస్థితిలో ఉంది. ఈ రోజు [illegible] పెట్టాలనుకున్నాను. కాని కష్టమౌతుందని [illegible]న్నాను.

[illegible] మా మిసెస్‌ని హాస్పిటల్‌కి తీసికెళ్ళాలను

కుంటున్నాను. అందుకే కొంచెం మీరు దయతలిస్తే ఎర్లీగా వెళ్ళాలను కుంటున్నాను.” అన్నాడు ఆనంద రావు తాను చెప్పదలచుకున్నదంతా గుక్కతిప్పుకో కుండా చెప్పేశాడు. కాని చివరికి చెమటలు క్రమ్మి మరీ మాటలురాలేదు ఆనందరావ్ కి.

“నిజమేనా లేక అబద్ధాలాడి ఆఫీస్ నుండి ఊడాయిం చాలనుకుంటున్నావా? అని అడిగారు ఆఫీసర్ గారు. అలాంటివారు ఒకరిద్దరు ఉన్నారు కాబట్టి.

“దొంగ దొంగా” అంటే భుజాలు తడుముకొనే స్థితిలో పడ్డాడు ఆనందరావు. ఏమో చెప్పాలనుకుంటు న్నాడు, కాని చెప్పలేక పోతున్నాడు.

అప్పుడే అక్కడికి ఫైల్ చేత పట్టుకొని, వచ్చిన మరోతోటి యల్.డీ.సి. రంగారావు ఆఫీసర్ గారి ప్రశ్నకు జవాబిచ్చాడు.

“నిజమేనండీ ఆనందరావు ఇంటి ప్రక్కనే మా ఇల్లు ఉంది. వాళ్ళ మిసెస్ ఎనిమిది రోజులనుండి జ్వరంతో బాధ పడుతోంది. ఇరుగుపొరుగు వాళ్ళం కాబట్టి, అందు లో ఒకే ఆఫీసులో పని చేసేవాళ్ళం కాబట్టి, కష్టాలొచ్చి నప్పుడు మేం ఒకరినొకరం ఆదుకుంటూ ఉంటాం. ఈ రోజు మా ఇంటినుండే భోజనం పంపించాం” అన్నాడు వినయంగా రంగారావు.

ఆఫీసర్ గారి హృదయము జాలితో నిండింది. “అలా అయితే వెళ్లిరా. కష్టాలు ఎవరికైనా వస్తాయి” అన్నారు.

తన ఎత్తు పారినందుకు ఆనందరావు సంతోషంగా బయటపడ్డాడు ఈలవేస్తు. రంగారావ్ ఆఫీసర్ వద్ద పని ముగించుకొని, తనగదిలోకి వచ్చాడు ఆనందంగా. అతనికి ఉదయం ఆనందరావు చెప్పిన మాటలే జ్ఞాపకం వస్తు న్నాయి.

“ఆఫీసర్ ముందు నేను కల్పించి చెప్పే అబద్ధా లన్నింటిని నిజమేనని చెప్పి ఆయనగారి నొప్పించి నన్ను ముందుగా పంపించే ఏర్పాటు చేస్తే మా దంపతులిద్దరికి సినిమా చూపిస్తా” నన్నాడు. అందుకే రంగారావు సమయానుకూలంగా ఆఫీసర్ గదిలోకి వచ్చి, ఆఫీసర్ గారిని ఒప్పించి, ఆనందరావ్ ని తొందరగా ఇంటికి పంపించే ఏర్పాటు చేశాడు.

♦ ♦ ♦

మంచి సస్పెన్స్ సమయంలో ఇంటర్ వెల్ అయింది. సినిమాటాకీస్ లోని వారంతా బయటకు వెళ్ళుతున్నారు. బాక్స్ లో కూర్చున్న ఆఫీసర్ గారు తన భార్య భుజముల మీద నుండి చేతులు తీసి, ఆవలిస్తూ క్రింది వైపు చూశారు. ఆశ్చర్యం! క్రింద ఫస్ట్ క్లాస్ లోని మొదటి వరుసలో కుర్చీలపై ఉల్లాసంగా ఆనందరావ్, రంగారావ్ లు తమ భార్యలతో సహా కూర్చున్నారు. సారేనా కాదాఅని





మీరు తెలుసా? మీరు ధరించియున్నది.

సి. టెక్స్

బనియన్లని?
లేనిచో, నేడే “సి. టెక్స” బనియన్లను
కొని ధరించండి.
అవి:- చక్కని అల్లిక - సరైన కొలత,
దీర్ఘకాలం మన్నిక, ధరించితే హాయి నిచ్చును.

: తయారించువారు :

Grams: CEETEX Phone: 21290
CHOWDAMBIKAI KNITTING CO.,
KAMARAJ ROAD : : TIRUPUR - 638604

పరీక్షించి చూశారు ఆఫీసర్ గారు. అనుమానం లేదు, అచ్చం వాళ్ళే! నలుగురు కొత్త కోలాలు తెప్పించుకొని త్రాగుతున్నారు. ఆఫీసులో సాయంత్రం తన ముందు ఎంత వగలుపోసారు. ఈ సమయంలో వారికొక్కసారి కనిపిస్తే వారి ముఖాలు ఎలా మారుతాయో చూడాలని ఆఫీసర్ గారు మొదటి తరగతి డోర్ వద్ద కచ్చాడడం మొదలుపెట్టారు.

నలుగురూ నవ్వు ముఖాలతో జంటలుగా బయటకు వస్తున్నారు. వాళ్ళెవరూ ఆఫీసర్ గారిని గమనించలేదు.

ఆనందరావ్ రంగారావ్ తో భుజాలెగరేస్తూ అంటున్నాడు "ఈ రోజు ఆఫీసర్ ముందు చక్కని ఎత్తు వేసి పెత్తిన గుడ్డకప్పి వచ్చాం ఏమైనా మనది తెలివంటే తెలివే."

"రంగారావంటే ఏమనుకున్నావ్ మరి! సాక్షిగా నిల్చొని అబద్ధాల్ని కూడా నిజం చేసి ఎంతవారినైనా బోల్తా కొట్టించగలడు" అన్నాడు, గర్వంగా తన భార్యవైపు చూస్తూ.

"ఏమైనా మనం అసాధ్యులం" అనుకొంటూ హోటల్ వైపు నడవసాగారు నలుగురు.

వారి మాటల్ని విన్న ఆఫీసర్ రామారావ్ గారు ఈ నాటి పనిదొంగల్ని తలచుకొని విచారంగా బాక్స్ లోకి చేరుకున్నారు.

మరునాడు ఆఫీసర్ గారు తనగదిలోకి ఆనందరావ్ ని పిలిపించుకున్నారు. ఆనందరావ్ ఆఫీసర్ ముందు చాలా వినయంగా నిల్చొన్నాడు.

"ఏమోయ్! నీ భార్య ఆరోగ్యం ఎలా ఉంది? నిన్న నీవు సాయంత్రం ఆరుగంటలకు నీ భార్యతో సహా రిక్షాలో డాక్టరింటికి వెళ్తున్నట్టున్నావ్! అప్పుడు నేను చూచాను. చాలా సీరియస్ గా ఉన్నట్టుందే?" అన్నారు ఆఫీసర్ గారు విచారాన్ని వ్యక్తపరుస్తూ.

ఆనందరావ్ ఆశ్చర్యంలో మునిగిపోయాడు. 'తను నిన్న భార్యతో సహా సినిమాకి వెళ్ళాడు కాని ఆఫీసర్ గారేమో తనని, డాక్టరింటికి వెళ్ళగా చూచానంటున్నారు. ఎవరినో చూచి తనే కావచ్చునని అనుకున్నారు. నిజంగా అదృష్టమంటే ఇలా ఉండాలి. తను నిన్నటి రోజు అబద్ధమాడి బయటపడ్డందుకు, ఎలాంటి అనుమానము ఆఫీసర్ గారికి రాలేదు. పైగా ఆయనగారే మమ్మల్ని చూచామంటున్నారు, కలిసి వచ్చింది కాలం' అనుకుంటు ఆఫీసర్ గారికి జవాబు చెప్పడం ప్రారంభించాడు.

"ఔనండి సార్ నిన్న మా మిసెస్ కి మరీ సీరియస్ గా ఉందని మిమ్మల్ని అడిగి ఇంటికిపోయి డాక్టర్ గారు మందులు వ్రాసి ఇచ్చారు. అవి నేటినుండి వాడుతున్నాం" అన్నాడు ఆఫీసర్ గారి అమాయకత్వానికి లోలోన నవ్వుకుంటూ.

"నీ స్నేహితుడు రంగారావ్ వాళ్ళ భార్య చాలా మంచివారున్నట్లున్నారు. మీతో సహా వారూ మరో రిక్షాలో నిన్న డాక్టర్ వద్దకు వచ్చినట్లున్నారు. నిజంగా స్నేహమంటే అలా ఉండాలి. కష్టంలో ఆదుకున్నవారే నిజమైన స్నేహితులు. ఏమంటావ్?" అన్నారు ఆఫీసర్ గారు ఆనందరావ్ ముఖకవళికల్ని పరిశీలిస్తూ.

'ఎవరినో చూచి మేమే కాబోలు అనుకున్నట్టున్నారు ఆఫీసర్ గారు. చాలా మంచిపని జరిగింది' అనుకొంటు "నిజమేనండీ మీరన్నట్లు కష్టంలో ఆదుకొన్న స్నేహితుడే స్నేహితుడు. రంగారావు నాకు నిజమైన స్నేహితుడండీ ఎప్పుడూ కష్టంలో ఆదుకొంటూ ఉంటాడు" అన్నాడు ఎంతో గర్వంగా. లోన మాత్రం రంగారావుని తిట్టుకున్నాడు 'వెధవరాస్కెల్ ఇంత చిన్న సహాయం చేస్తాడో లేదో ఎంతో డబ్బు రాబడుతాడు. అసలు వాడు లంచం తిననిదే ఎన్నడు ఎవరికి చిన్న సహాయమైనా చేసి ఎరుగడు.

"మీలాంటివారంటే నాకు చాలా ఇష్టమోయ్" అంటూ ఆఫీసర్ గారు కాలింగ్ బెల్ నొక్కాడు. "అయ్యా!" అంటూ ప్యూన్ వచ్చి వినయంగా నిలబడ్డాడు.

"యల్.డీ.సి. రంగారావ్ ని తోలుకొనిరా" అజ్ఞాపించారు ఆఫీసర్ గారు. వెంటనే వెళ్ళాడు ప్యూన్.

"నిజంగా స్నేహితులంటే మీలా ఉండాలోయ్" అంటున్నారు ఆఫీసర్ గారు ఇంతలో రంగారావు అక్కడికి వచ్చాడు.

"ఏమోయ్! రంగారావ్! నిన్న రాత్రి నీవు నీభార్యతో సహా ఆనందరావ్ మిసెస్ కి చాలా సపర్యలు చేశారట, ఆనందరావ్ నీ గురించి చాలా చాలా చెబుతున్నాడు. మీరు ఆదర్శ మిత్రులు ఏమంటావ్?" అని అడిగారు ఆఫీసర్ గారు, రంగారావుని నఖశిఖపర్యంతరం పరిశీలిస్తూ.

రంగారావ్ అవస్థలో పడిపోయాడు. 'తనసలు రాత్రి ఆనందరావ్‌తో సినిమాకి వెళ్ళాడు కదా! మరి ఆఫీసర్ గారేమో ఆనందరావుతో డాక్టరింటికి వెళ్ళాడని అంటున్నారు. ఇదంతా ఆనందరావు కల్పించి చెప్పాడా? లేక ఆఫీసర్ గారు నన్ను పరీక్షిస్తున్నారా? తనేలా బయట పడాలి ఈ పరీక్షనుండి తనేం జవాబివ్వాలి ఆఫీసర్ గారికి? ఒకవేళ ఔనంటే రాత్రి తాము సినిమాకి వెళ్ళిన సంగతి ఆనందరావు చెప్పి ఉండవచ్చు! అలాంటప్పుడు తను అబద్ధ మాడినవాడౌతాడు. ఒకవేళ కాదంటే చేజేతులా తమకు తామే నిజాన్ని బయట పెట్టుకున్న వారమౌతామేమో ఏం చెయ్యాలి ఇప్పుడు తను ఏం చెప్పాలి.' అనుకుంటూ జవాబివ్వడానికి నీళ్ళు నమల సాగాడు రంగారావు.

ఆనందారావు సైగను గమనించిన రంగారావ్ రక్షించావు భగవంతుడా అనుకుంటూ "నిజమండీ రాత్రి నిద్రలేదు ఆనందరావ్ మిసెస్‌ను డాక్టర్ గారిచే పరీక్ష చేయించాం రాత్రి చాలా చాలా భయపడ్డాం నేటినుండి డాక్టర్ గారు వ్రాసి ఇచ్చిన మందులు తినిపిస్తున్నాం" అన్నాడు తేర్పుగ.

వీళ్ళ అబద్ధాల ధోరణికి ఆఫీసర్ గారు మండిపోయారు. ఇక బుద్ధి చెప్పాలనుకున్నారు.

"నిన్న నేను సినిమాకెళ్ళాను టాకీస్‌లో ఫస్ట్‌క్లాస్ రూంలో ఇద్దరు వ్యక్తులు తమ భార్యలతో సహా వచ్చారు. వారు అచ్చం మీలాగే ఉన్నారు, వారు మీరేనా లేక మీ అవతారంలో దిగివచ్చిన దేవతలా? అని ప్రశ్నించారు ఆఫీసర్ గారు వ్యంగ్యధోరణిలో.

ఆఫీసర్ గారి మాటల్ని విన్న వారిద్దరికి పక్కలో బాంబు ప్రేలినట్లనిపించింది. ముఖాన కత్తి వాటుకి నెత్తుటిచుక్క లేకుండా పోయింది. భయంతో ఇద్దరు వణకసాగారు.

"ఏం చెప్పరేం? రాత్రి సినిమానికి వచ్చింది మీరేనా కాదా? గర్జిస్తూ అడిగారు ఆఫీసర్ గారు.

పై ప్రాణాలు పైపైనే ఎగిరిపోయినంత పనైంది ఇద్దరికి "సా_సా_సార్ త_త_తప్పయిందిసార్" అంటూ చెమటల్ని తుడుచుకోసాగారు.

"మీరిద్దరు అబాధ్యులు కదూ!? ఆఫీసర్ చెత్తిన తడిసిన్న కళ్ళు తెనగాళ్ళు కదూ!? ఉడియోగ్న అబద్ధాలాడి పని తప్పించుకొని బాధ్యతల్ని విస్మరించే బద్ధ్యావ్‌లు మీరు. మీలాంటి చీడపురుగులుంటే దేశం చెడిపోతుంది. డామిట్స్ మిమ్మల్నేం చేస్తానో చూడు" అంటు మండిపోయారు ఆఫీసర్ గారు.

ఆనందరావ్, రంగారావ్‌లు ఆఫీసర్ గారి కాళ్ళు పట్టుకున్నంత పనిచేసి "ఈ సారికి మమ్మల్ని క్షమించండిసార్ మా కడుపులపైన కొట్టకండిసార్ ఇకముందు మేము ఇలాంటి తప్పుపనులు ఎప్పుడైన చేస్తే మమ్మల్నే విధంగా శిక్షించినా అనుభవిస్తాంసార్ ఏదో బుద్ధి గడ్డితిని ఇలా చేశాంసార్" అంటూ పశ్చాత్తాపంతో కన్నీళ్ళు తెచ్చుకున్నారు.

"అబద్ధాలాడి పని తప్పించుకునే సోమరి పోతులు, అసమర్థులు, అవినీతి పరులు ఈ ఆఫీస్‌లో ఉండకూడదు. ఈ సారి క్షమిస్తున్నాను. మరెప్పుడైనా ఇలా చేశారా మిమ్మల్ని కఠినంగా శిక్షిస్తాను జాగ్రత్త! ఊఁ ఎవరి సెక్షన్లోకి వారు వెళ్ళండి" అంటూ హుంకరించారు ఆఫీసర్ గారు.

పరుగున బయటపడ్డ స్నేహితులిద్దరు ఈ సారికి బ్రతికి పోయాంరా బాబూ! ఇకముందెప్పుడు ఇలాంటి తప్పు పనులు చేయకూడదనుకుంటూ, చెంపలు వాయించుకున్నంత పని చేశారు.

అబద్ధం తెచ్చిన అవస్థను గురించి తల్లడిల్లి పోతున్నారు ఆనందరావు, రంగారావులు. ఆనాటినుండి వారు ఆఫీసర్ గారి ముఖాన్ని ధైర్యంగా చూడలేక పోతున్నారు. ఎప్పుడైనా సెలవు అవసరమున్నా ఆఫీసరుగారని అడుగలేకపోతున్నారు. తమ మాటల్ని ఆఫీసరుగారు నమ్మరని వారికి తెలుసు. ఒక్కసారి అబద్ధమాడితే ఎన్ని చిక్కులా వస్తాయో అనుభవపూర్వకంగా తెలుసుకున్నారు ఇద్దరు.

వారికి చిన్నప్పుడు చదువుకున్న కథ పదేపదే జ్ఞాపకం రాసాగింది.

మేకలకాపరి తండ్రితో పులిని గూర్చి ఆడిన అబద్ధాల కథ.

